సాక్షి గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

సోమవారం | 18 | సెప్టెంబర్ | 2023




పూలు, పత్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు

నేడు వినాయక చవితి

● నగరంలో పండుగ సందడి

హన్మకొండ కల్చరల్: విఘ్నాలను తొలగించి విజయాలను చేకూర్చే గణనాథుడి పండుగ వినాయక చవితిని సోమవారం నగర ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవడానికి సిద్ధమయ్యారు. గణపతి విగ్రహాలు, పూజా సామగ్రి కొనుగోలు చేసేవారితో ప్రధాన కూడళ్లు కిక్కిరిసిపోయాయి. అలాగే నవరాత్రులు పూజలు చేయడానికి మండపాలను సిద్ధం చేసి గణపతి ప్రతిమలను ఆదివారమే తీసుకువచ్చారు.



విక్రయానికి వినాయక ప్రతిమలు

న్యూస్‌రీల్

18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు



కాజీపేట అర్బన్: వయసు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు లభిస్తుందని, ఫామ్–6 పూర్తి చేసి నమోదు చేసుకోవాలని ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా తెలిపారు. హంటర్‌రోడ్డులోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ డిగ్రీ బాలికల కళాశాలలో ఆదివారం ఓటు హక్కుపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. దేశభవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని, మెరుగైన సమాజ నిర్మాణానికి సరైన ప్రజాప్రతినిధులను ఎంచుకోవడానికి ఓటు హక్కును వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ హరిప్రసాద్,కళాశాల సిబ్బంది దయాకర్, రమ, రాధిక పాల్గొన్నారు.

ధర్మ పరిరక్షణ కోసమే సనాతన ధర్మం



హన్మకొండ కల్చరల్: హిందూ దేవాలయాల్లో ధర్మ పరిరక్షణ కోసం సనాతన ధర్మాన్ని అనుసరించి కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి రాజ్‌కుమార్ రంజన్‌సింగ్ అన్నారు. ఆదివారం హనుమకొండలోని శ్రీరుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల దేవాలయాన్ని ఆయన సందర్శించారు. ఈఓ వెంకటయ్య, ప్రధానార్చకులు గంగు ఉపేంద్ర శర్మ మంత్రిని ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతించారు. మంత్రి స్వామివారికి అభిషేకం, పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలు, స్వామివారి శేష వస్త్రాలు, మహాదాశీర్వచనం అందజేశారు. ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేసినట్లు మంత్రి తెలిపారు.

దరఖాస్తులు త్వరగా స్వీకరించాలి



హన్మకొండ అర్బన్: నియోజకవర్గంలో 18–19 సంవత్సరాల వయసు కలిగిన ఓటర్ల నమోదు ఎక్కువగా ఉన్నందున వారి నుంచి ఫామ్–6 దరఖాస్తులు త్వరగా స్వీకరించాలని ఈఆర్‌ఓ ఎల్.రమేష్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో బీఎల్‌ఓలు, బీఎల్‌ఓ సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నియోజకవర్గంలో 18–19 ఏళ్ల వయసు ఓటర్లు 4,400 వరకు మాత్రమే ఉన్నారని, ఇంకా 10వేల వరకు నమోదు చేసుకోవాలన్నారు. హనుమకొండ, కాజీపేట తహసీల్దార్లు విజయ్‌కుమార్, బావ్ సింగ్, బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కమిషనరేట్‌లో సమైక్యతా దినోత్సవం

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఆదివారం జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ జాతీయ జెండా ఆవిష్కరించిన అనంతరం సిబ్బందికి, పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు. డీసీపీలు దాసరి మురళి, రవీందర్, బారి, అదనపు డీసీపీలు రాగ్యానాయక్, సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కాజీపేట జంక్షన్‌లో స్వచ్ఛ పక్షోత్సవం



కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో స్వచ్ఛ రైలు.. స్వచ్ఛ భారత్ పక్షోత్సవాన్ని పురస్కరించుకుని పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు కాజీపేట రైల్వేస్టేషన్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, రైల్వే చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ బి.రాజేశ్ తెలిపారు. కాజీపేట రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆదివారం జరిగిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. అక్టోబర్ 2 వరకు స్వచ్ఛ రైలు, స్వచ్ఛ క్లీన్, స్వచ్ఛస్టేషన్, స్వచ్ఛ ఆహారం, ప్లాస్టిక్ నిషేధంతోపాటు ప్రయాణికులకు ప్లాట్‌ఫాంలు, స్టేషన్ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. రైల్వే వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ సంధ్య, రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్ సెక్రటరి దేవులపల్లి రాఘవేందర్ పాల్గొన్నారు.

సంక్షేమంలో అగ్రగామి



వరంగల్ వేడుకల్లో మాట్లాడుతున్న డాక్టర్ బండా ప్రకాశ్



ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు



శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్

● వరంగల్‌లో జాతీయ సమైక్యతా దినోత్సవం

కరీమాబాద్: సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా నిలుస్తోందని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ అన్నారు. వరంగల్ ఆజంజాహి మిల్ గ్రౌండ్(ఐడీఓసీ) మైదానంలో ఆదివారం జరిగిన తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవ వేడుకలకు బండా ప్రకాశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జాతీయ జెండాను ఆవిష్కరించిన తర్వాత పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్వరాష్ట్రంలో పరిశ్రమలు, పర్యావరణం, పల్లె, పట్టణ ప్రగతి, సంక్షేమ పథకాలతో సబ్బండవర్ణాలను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విప్లవాత్మక పథకాలతో రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. అనంతరం తెలంగాణలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, మేయర్ గుండు సుధారాణి, డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీం, అదనపు కలెక్టర్లు శ్రీవత్స, అశ్వినితానాజీ వాకడే, డీసీపీ రవీందర్, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, ఎమ్మెల్యేలు నరేందర్, పెద్ది సుదర్శన్ రెడ్డి, ఎంఎల్‌సీ బస్వరాజు సారయ్య, మాజీ జెడ్పీ చైర్మన్ సాంబారి సమ్మారావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో వేడుకలు..

వరంగల్ కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రావీణ్య జాతీయ పతాకావిష్కరణ చేసి జెండా వందనం చేశారు. అడిషనల్ కలెక్టర్లు శ్రీవత్స, అశ్వినితానాజీ వాకడే, ఆర్డీఓ వాసుచంద్ర, ఏఓ శ్రీకాంత్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో నంబర్ వన్



హనుమకొండలో జరిగిన వేడుకలకు హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు



జెండా ఎగురవేసి వందనం చేస్తున్న చీఫ్ విప్, తదితరులు



వేడుకల సందర్భంగా పరేడ్ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్

● పరేడ్ గ్రౌండ్స్‌లో జాతీయ సమైక్యతా దినోత్సవం

వరంగల్ క్రైం: తెలంగాణ 60 సంవత్సరాల పాటు అస్తిత్వం కోసం ఉద్యమించింది.. నేడు స్వరాష్ట్రమై అన్ని రంగాల్లో అద్భుతమైన అభివృద్ధి సాధిస్తూ దేశంలోనే అగ్రగామిగా రూపుదాల్చిందని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయన ఉదయం 9 గంటలకు జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్ మాట్లాడుతూ.. భారతదేశ నిర్మాణంలో తెలంగాణ భాగం పంచుకున్న ఈ రోజును జాతీయ సమైక్యతా దినంగా మనం ఘనంగా జరుపుకుంటున్నామని చెప్పారు. ప్రజాస్వామిక స్వేచ్ఛ పొందడానికి యావత్ సమాజం ఉద్యమించిన తీరు, నాటి అపూర్వ ఘట్టాలు జాతి జీవనంలో సజీవంగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. యోధుల త్యాగాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. అనంతరం జిల్లా అభివృద్ధికి సంబంధించి వివరించారు. కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్, కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ పాల్గొన్నారు.

జాతీయ కార్మిక దినోత్సవంగా నిర్వహించాలి

● టీఆర్‌పీఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శశికుమార్

హన్మకొండ: ప్రపంచ మొదటి కార్మికుడు విశ్వకర్మ జయంతిని జాతీయ కార్మిక దినోత్సవంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శశికుమార్ అన్నారు. ఆదివారం హనుమకొండ అడ్వకేట్స్ కాలనీలోని యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ విమోచన దినం, విశ్వకర్మ జయంతి కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఈ ప్రాంత ప్రజలు పోరాటం చేస్తున్న క్రమంలో అప్పటి దేశ హోం శాఖ మంత్రి వల్లభాయి పటేల్, భారత సైన్యంతో ఒత్తిడి తీసుకురావడంతో లొంగిపోయారని, దీంతో అప్పటి వరకు నిజాం పాలనలో ఉన్న తెలంగాణ భారత్‌లో కలిసిందన్నారు. యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రావుల రమణారెడ్డి మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని యాజమాన్యాన్ని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి దారావత్ లక్ష్మణ్‌నాయక్, బీఎంఎస్ జిల్లా కన్వీనర్ గాదె మహేందర్, నాయకులు గంజి శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, దాస్యం వేణుమాధవ్, సంగీత్‌కుమార్, గోలి అనిల్ రెడ్డి, వేణు, కె.యుగేందర్, కడెం మహేష్, గాజుల సంపత్ కుమార్, పుల్లాజీ, శ్రీనివాస్, రాజకుమార్, పిల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



విమోచన దినోత్సవ వేడుకల్లో నాయకులు

బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో..

కాజీపేట అర్బన్: హనుమకొండ కలెక్టరేట్‌లోని బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో ఆదివారం బీసీ వెల్ఫేర్ డీడీ రాంరెడ్డి ఆధ్వర్యాన విరాట్ విశ్వకర్మ యజ్ఞమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతిప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణుల సంఘం నాయకులు అలుగోజు కృష్ణమూర్తి, శ్రీరామోజు సోమేశ్వర రావు, విష్ణువర్ధన్, భరత్, సురేందర్, బీసీ వెల్ఫేర్ సిబ్బంది కందాల శంకరయ్య, రవీందర్‌రెడ్డి, వెంకటరమణ, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణకు ప్రజాస్వామిక స్వేచ్ఛ

● అమరుల పోరాటాలు చిరస్మరణీయం

● జాతీయ జెండాను ఎగురవేసిన మేయర్ సుధారాణి

వరంగల్ అర్బన్: తెలంగాణ ప్రజాస్వామిక స్వేచ్ఛను పొందడం కోసం అనేక మంది అమరులయ్యారని, సీఎం కేసీఆర్ నేతృత్వంలో చేసిన ఉద్యమం మరువలేనిదని మేయర్ గుండు సుధారాణి అన్నారు. ఆదివారం వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయంలో తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవ వేడుకల్లో ఆమె జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం సమర్పించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. 75 సంవత్సరాల క్రితం తెలంగాణ భారతదేశంలో అంతర్భాగంగా మారిందన్నారు. అందుకే తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, కార్పొరేటర్లు మరుపల్లి రవి, పల్లం పద్మ, గుండు చందన, ఇమ్మడి లోహిత, బోంగు అశోక్, రామా తేజస్విని, అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్, తదితరులు పాల్గొన్నారు.



మెట్టుగుట్ట పరిసరాలను శుభ్రం చేస్తున్న మేయర్ సుధారాణి, కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు

వెలవెల..

జాతీయ సమైక్యతా వేడుకలకు బల్దియా అధికారులు, ఉద్యోగులు నామమాత్రంగానే హాజరయ్యారు. దీంతో కార్యక్రమం వెలవెలబోయింది. కనీసం అమరులకు నివాళులు అర్పించకపోవడంపై ఉద్యమకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : మేయర్ గుండు సుధారాణి

మడికొండ: కాజీపేట మండలం పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మేయర్ గుండు సుధారాణి అన్నారు. మడికొండలోని శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయ పరిసరాలను ఆదివారం మేయర్ తదితరులు శుభ్రం చేశారు. ముందుగా ఉదయం మెట్టుగుట్టపై ఆమె ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వచ్ఛ భారత్ మిషన్ అర్బన్ ఇనిషియేటివ్ కార్యక్రమంలో భాగంగా ఇండియన్ స్వచ్ఛతా లీగ్ 2.0 కార్యక్రమంలో 'జాయిన్ ది ఫైట్ ఫర్ గార్బేజ్ ఫ్రీ సిటీస్' అంశంపై మెట్టుగుట్ట మీద ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆగస్టు 15 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. ఇందులో యువత ను భాగస్వామ్యం చేస్తూ బల్దియా ఆధ్వర్యంలో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పరిసరాలను శుభ్రం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కిట్స్ కళాశాల విద్యార్థులు, మడికొండ సాంఘిక సంక్షేమ కళాశాల విద్యార్థులు, ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. కార్యక్రమంలో మేయర్ సుధారాణితో పాటు 46, 64వ డివిజన్ కార్పొరేటర్లు మునిగాల సరోజన, ఆవాల రాధికరెడ్డి, అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్, సీఎంహెచ్‌ఓ రాజేశ్, డీఎఫ్‌ఓ శంకర్‌లింగం, టీపీఆర్‌ఓ రాజేశ్‌కుమార్‌గౌడ్, టీఎంసీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి ఎదుట మృతుడి బంధువుల ఆందోళన

వరంగల్ చౌరస్తా: వరంగల్ జేపీఎన్ రోడ్డులోని సత్య ఆస్పిటల్ ఎదుట ఆదివారం మృతుడి బంధువులు ఆందోళనకు దిగారు. వరంగల్ శివనగర్‌కు చెందిన మధు (42) మోకాళ్ల చిప్ప ఆపరేషన్ కోసం మూడు రోజుల క్రితం సత్య ఆస్పత్రిలో చేరాడు. శస్త్ర చికిత్స పూర్తయింది. అయితే మధు అకస్మాత్తుగా మృతి చెందడంతో అతడి బంధువులు వైద్యుడి నిర్లక్ష్యమే ఇందుకు కారణమని ఆందోళనకు దిగారు. వరంగల్ ఇంతేజార్‌గంజ్, మట్టెవాడ పోలీసులు చేరుకున్నారు. కనీసం కే షీట్స్, ఇతర రిపోర్టులు అడగ్గా వైద్యులు ఇవ్వడంలేదని మృతుడి బంధువులు నిరసన తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇంతేజార్ గంజ్ సీఐ మస్కె శ్రీనివాస్ తెలిపారు.



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

మల్లన్న ఆలయంలో కన్యాసంక్రమణ పూజలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఐనవోలు: సూర్యుడు కన్యరాశిలోకి ప్రవేశించిన సందర్భంగా ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం నిత్య కైంకర్యాల అనంతరం కన్యాసంక్రమణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్ర హోమం చేశారు. గొల్ల కేతమ్మ, బలిజ మేడలమ్మ సమేత శ్రీమల్లికార్జునస్వామి కల్యాణం శైవాగమోక్తంగా చేపట్టారు. అలాగే ఒగ్గు పూజారులు గర్భాలయం ఎదుట మహా మండపంలో నజరు పట్నం వేసినట్లు ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు ఐనవోలు మధుకర్ శర్మ, వేద పారాయణ దారు గట్టు పురుషోత్తమ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా హనుమకొండ

● ప్రభుత్వ చీఫ్‌విఫ్ దాస్యం వినయ్‌భాస్కర్

విద్యారణ్యపురి: హనుమకొండ ఎడ్యుకేషన్ హబ్‌గా పురోగమిస్తున్నదని ప్రభుత్వ చీఫ్ విప్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండలోని భారతి విద్యాభవన్ హైస్కూల్‌లో ఆదివారం జరిగిన హనుమకొండ డిస్ట్రిక్ట్ అన్ ఎయిడెడ్ ప్రయివేట్ స్కూల్స్ అసోసియేషన్(హడుప్సా) సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యాసంస్థల అభివృద్ధితో పాటు సమస్యల పరిష్కారానికి హడుప్సా కృషిని అభినందించారు. కలెక్టర్ సిక్తాపట్నాయక్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే భవిష్యత్ లక్ష్యం ఎంచుకుని కష్టపడి చదవాలని సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరి జీవితంలో వెలుగు నింపేది చదువు ఒక్కటేనని అన్నారు. హడుప్సా అధ్యక్షుడు వి.జనార్దన్, జనరల్‌సెక్రటరీ పి.వెంకటరమణ, అడ్వయిజర్ టి.బుచ్చిబాబురావు, కోశాధికారి డి.శంకర్, బాధ్యులు శ్రీనివాస్ రెడ్డి, రాజేశ్వర్‌రావు, సంతోష్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, వేణు మాధవ్‌రావు, శివానంద్, సతీష్‌కుమార్, రామారావు ,వెంకటరెడ్డి, సంపత్‌రెడ్డి, అమరేందర్ మాట్లాడారు. అనంతరం 10జీపీఏ సాధించిన విద్యార్థులను సన్మానించారు.



మాట్లాడుతున్న దాస్యం వినయ్‌భాస్కర్

స్వరాష్ట్ర అభివృద్ధి సీఎం కేసీఆర్‌తోనే ..

కాజీపేట అర్బన్ : స్వరాష్ట్ర అభివృద్ధి ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో 'కుడా' మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన పశ్చిమ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, బీఆర్‌ఎస్ పార్టీ కన్వీనర్ జనార్దన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి సూచికల్లో తెలంగాణ..

● టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు

హన్మకొండ: స్వరాష్ట్రంగా సిద్ధించినప్పటి నుంచి తెలంగాణ.. ప్రగతి సూచికల్లో అగ్రగామి రాష్ట్రంగా కొనసాగుతోందని టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు అన్నారు. సమైక్యతా దినోవత్సవం సందర్భంగా ఆదివారం హనుమకొండ నక్కలగుట్టలోని ప్రధాన కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు విద్యుత్ అమర వీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారన్నారు. సీఎం కేసీఆర్.. ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ అన్ని వర్గాలకు అందజేస్తున్నారన్నారు. సమైక్యతతోనే ఆర్థిక ప్రగతి, సంక్షేమమని, విద్యుత్ రంగంలో ఎన్నో మైలురాళ్లు అధిగమించామన్నారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్ రావు నేతృత్వంలో ప్రజలకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామన్నారు. డైరెక్టర్లు బి.వెంకటేశ్వర రావు, పి.గణపతి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.జనార్దన్, సీజీఎంలు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, వి.మోహన్ రావు, కె.కిషన్, ప్రభాకర్, రవీంద్రనాథ్, జాయింట్ సెక్రటరీ కె.రమేష్, కంపెనీ కార్యదర్శి కె.వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



జెండాకు వందనం చేస్తున్న గోపాల్ రావు

నేటి నుంచి గణపతి నవరాత్రులు

హన్మకొండ కల్చరల్ : హనుమకొండలోని వేయి స్తంభాల దేవాలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ప్రముఖ దాతల సహకారంతో జిల్లా యంత్రాంగం, నగరపాలక సంస్థ అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ కె.వెంకటయ్య, ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. తొమ్మిది రోజులు అభిషేక పూజలు, అలంకరణ సేవలో పాల్గొని గోత్రనామాదులతో పూజలు చేయించుకునే వారు రూ.2,116 చెల్లించి రశీదు తీసుకోవాలని సూచించారు. వేముల సత్యమూర్తి ఆధ్వర్యంలో నిత్యం అన్నప్రసాదాల వితరణ ఉంటుందని, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, లయన్ వెంకటేశ్వర్లు, గోపీనాథ్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. విఘ్నేశ్వరుడికి తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక అలంకరణలు చేయనున్నట్లు వివరించారు.

ఉద్యమకారులను ఆదుకోవాలి

మడికొండ: తెలంగాణ ఉద్యమం సమయంలో పనిచేసి జైలుకు వెళ్లిన ఉద్యమకారుడు పల్లవు శ్రీనివాస్(భాషా) తెలంగాణ విమోచన దినోత్సవం రోజున మడికొండలోని అమర వీరులస్తూపం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి నిరసన దీక్ష చేపట్టాడు. మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్ దీక్ష ప్రారంభించి మాట్లాడుతూ సోనియాగాంధీ తెలంగాణలో ఆత్మహత్యలను ఆపాలని తెలంగాణ రాష్ట్రం ఇచ్చిందని, దీనిని కేసీఆర్ విస్మరించి తానే రాష్ట్రం తెచ్చినట్లు చెప్పుకుంటున్నాడని విమర్శించారు. సీపీఐ జిల్లా నాయకుడు గడ్డం అశోక్, వస్కుల దేవేందర్ దీక్ష విరమణ చేశారు. తమ డిమాండ్‌ను నెరవేర్చే వరకు దీక్ష కొనసాగిస్తానని శ్రీనివాస్ తెలిపారు. వస్కుల శంకర్, కుర్ల మోహన్, వస్కుల శ్రీనివాస్, గుర్రం అమర్‌నాథ్, దువ్వ విజయ్, కుమార్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

● రెడ్డి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు జయపాల్‌రెడ్డి

ధర్మసాగర్: రెడ్డి కులస్తుల సంక్షేమానికి రూ.5,000 కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రెడ్డి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. పెద్ద పెండ్యాలలో సంఘం గ్రామ అధ్యక్షుడు బొల్లెడ్ల ప్రకాశ్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం రెడ్డి సంఘం కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం జయపాల్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేద రెడ్డి కులస్తుల పిల్లలకు విదేశీ విద్యానిధి కేటాయించాలని కోరారు. ప్రతీ రైతుకు రూ.5 లక్షల హెల్త్ కార్డు ఇవ్వాలని, రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో రెడ్డి సంక్షేమ భవన్‌కు 5 ఎకరాల భూమి, భవన నిర్మాణానికి రూ.10 కోట్ల నిధులు కేటాయించాలన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పూర్తిస్థాయిలో వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. శ్మశాన వాటిక ఏర్పాటు చేయడానికి బొల్లెడ్ల మదన్‌మోహన్‌రెడ్డి 5 గుంటలు ఉచితంగా ఇచ్చారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు అర్జుల కిషన్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పత్తి సంపత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఊకంటి వనం రెడ్డి, ఉపాధ్యక్షుడు మట్ట రాజశేఖర్, తోకల జయపాల్, పల్లెర్ల శ్రీనివాస్, ఏడెల్లి తిరుపతి, సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల శ్రీనివాస్, యూత్ విభాగం మండల అధ్యక్షుడు బొల్లెడ్ల వికాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోపు జయపాల్‌రెడ్డి

గణనాథుని పూజించండి... సిరిసంపదలతో తులతూగండి

- Advt Feature


మట్టి గణపతిని పూజిద్దాం..
పర్యావరణాన్ని కాపాడుదాం..

వినాయకుడు




వినాయకుడంటే భౌతికంగా మనకు కనిపించే ఆకారం మాత్రమే కాదు.. ఆయన రూపు, స్వభావం వెనుక లోతైన అర్థం ఉందని వేదాంతులు చెబుతుంటారు. గణేశుని ఆరాధనతో బాధల నుంచి సులభంగా విముక్తి పొంద వచ్చని సూచిస్తుంటారు. అందుకే గణేశుడే ప్రముఖంగా ఆరాధించబడే గాణపత్యం అనే శాఖ కూడా ఉంది. వినాయకుని ఆరాధనలో ఆధ్యాత్మిక రహస్యాలు ఎన్నో ఉన్నాయని చెప్పేందుకు ఓ గొప్ప ఉదాహరణ ఆయన అవతారాలు. ముద్గల పురాణం ప్రకారం వినాయకుడు ఎనిమిది అవతారాలను ధరించాడు. ఆ ఎనిమిది అవతారాల వివరాలను, గణనాథుని మహిమలను తెలుసుకుని ఆ వినాయకుని సేవించి తరిద్దాం.

వక్రతుండుడు




పూర్వం ఇంద్రుడు చేసిన ఒక పొరపాటు వల్ల 'మాత్సర్యాసురుడు' అనే రాక్షసుడు ఉద్భవించాడు. అతని ధాటికి ముల్లోకాలూ అల్లాడిపోయి దేవతలంతా దత్తాత్రేయుని శరణు వేడారు. అంతట దత్తాత్రేయుడు, గణపతిని ప్రార్థించమని సూచించాడు. 'గం' అనే బీజాక్షరంతో దేవతలంతా ఆ గణపతిని గురించి తపస్సు చేయగానే 'వక్రతుండుని'గా అవతరించాడు. ఆయన సింహవాహనుడై ఆ మాత్సర్యాసురుని జయించాడు. వక్రతుండం అనేది ఓంకారానికి ప్రతీకగా, మాత్సర్యాసురుడు మనలోని మత్సరానికి (ఈర్ష్య) ప్రతీకగా చెప్పుకోవచ్చు. ఈ లోకం నాది, ఈ లోకంలో అందరికంటే నాదే పైచేయి కావాలి అనుకున్న రోజున ఈర్ష్యాసూయలు జనిస్తాయి. ఈ జగత్తు ఒక నాటకం మాత్రమే అని గ్రహించిన రోజున మనసులో ఎలాంటి ఈర్ష్య ఉండదు.

ఏకదంతుడు



చ్యవనుడనే రుషి మదాసురుడనే రాక్షసుని సృష్టించాడు. రాక్షసుల గురువైన శుక్రాచార్యుడు అతనికి 'హ్రీం' అనే మంత్రాన్ని ఉపదేశించి నిరంతరం జపిస్తే ఫలితం దక్కుతుందన్నాడు. లోకాధిపత్యమే అభీష్టంగా గల మదాసురుడు ఆ హ్రీంకారాన్ని యుగాల తరబడి జపించాడు. దాంతో అతనికి కోరుకున్న శక్తులన్నీ లభించి మదాసురునికి తిరుగులేకుండాపోయింది. అతని చేష్టలకు దేవతలంతా భీతిల్లిపోయి సనత్కుమారుని చెంతకు ఉపాయం కోసం పరుగులు తీశారు. సనత్కుమారుని సూచన మేరకు వారంతా గణేశుని కోసం ప్రార్థించగా, ఆయన 'ఏకదంతు'నిగా అవతరించి మదాసురిని జయించాడు. ఇక్కడ మదాసురుడు అంటే మదానికి (గర్వం) చిహ్నం, ఏకదంతుడు ఈ సృష్టి యావత్తూ ఒకటే అన్న అద్వైతానికి చిహ్నం.

మహోదరుడు




శివుడు ఓసారి తీవ్రమైన తపస్సులో మునిగిపోయాడు. ఎంత కాలమైనా ఆయన ఆ తపస్సుని వీడకపోవడంతో పార్వతి కంగారు పడి పరమేశ్వరుని తపస్సు నుంచి బయటకు తీసుకురావాలని గిరిజన యువతిగా మారి ఆయన తపోభంగం కలిగించే ప్రయత్నం చేసింది. పార్వతి చేష్టలకు పరమేశ్వరునికి దిగ్గున మెలకువ వచ్చి ఏం జరిగింది అన్న అయోమయం కూడా ఏర్పడి ఓ రాక్షసుడు జనించాడు. అతనే మోహాసురుడు. ఆ మోహాసురుడు సూర్యుని ఆరాధించి ముల్లోకాధిపత్యాన్ని సాధించాడు. దేవతల ప్రార్థనను మన్నించి గణేశుడు లంబోదరునిగా అవతరించాడు. మోహం ఎప్పుడూ అయోమయానికి దారితీస్తుంది. దృక్పథం సంకుచితంగా మారిపోతుంది. అందరూ నావారే అన్న విశాలమైన దృష్టి కలిగిన రోజున ఆ మోహం దూరమైపోతుంది.

గజాననుడు



కుబేరుని ఆశ నుంచి లోభాసురుడు అనే రాక్షసుడు జనించాడు. శివపంచాక్షరిని జపించిన ఆ లోభాసురుడు, శివుని అనుగ్రహంతో ముల్లోకాలనూ జయించే వరాన్ని పొందాడు. కానీ అతని లోభానికి అంతులేకుండా పోయింది. చివరికి శివుని కైలాసాన్ని కూడా తన స్వాధీనంలోకి తెచ్చుకోవాలనుకున్నాడు. ఆ విషయాన్ని తెలుసుకున్న దేవతలు రైభ్యుడనే రుషిని శరణువేడారు. గణపతిని కనుక ఆవాహన చేస్తే, లోభాసురుని పరాజయం ఖాయమని సూచించాడు. అలా సకల దేవతల ప్రార్థనలను మన్నించి గణేశుడు 'గజాననుడి'గా అవతరించి లోభాసురుని జయించాడు. గజాననుడు అంటే ఏనుగు ముఖం కలిగినవాడు అని అర్థం. ఏనుగు తల బుద్ధిని సూచిస్తుంది. ఆ బుద్ధిని కనుక ఉపయోగిస్తే మనలోని లోభం (అత్యాశ, పిసినారితనం) దూరం కాకతప్పదు.

లంబోదరుడు



దేవ, రాక్షసులు కలిసి సాగరాన్ని మథించినప్పుడు చివరగా అమృతం దక్కిన విషయం తెలిసిందే! ఈ అమృతాన్ని రాక్షసులకు కాకుండా చేసేందుకు విష్ణుమూర్తి మోహినీ అవతారాన్ని ధరించాడు. మోహిని రూపంలో ఉన్న విష్ణుమూర్తిని చూసిన శివునికి కూడా మనసు చలించగా విష్ణువు తన నిజరూపంలోకి రావడంతో శివుడు భంగపడి క్రోధితుడయి క్రోధాసురుడు అనే రాక్షసుడు జనించాడు. సూర్యదేవుని ఆశీస్సులతో మహాబలవంతుడయ్యాడు. క్రోధాసురుడు ప్రీతి అనే కన్యను వివాహమాడగా హర్షం, శోకం అనే సంతానం కలిగారు. వినాయకుడు లంబోదరుని రూపంలో క్రోధాసురుడిని అణచివేశాడు. క్రోధం ఎప్పుడూ తాను ఇష్టపడిన దాని కోసం వెంపర్లాడుతుంది. ఆ వెంపర్లాటలో గెలిస్తే హర్షం, ఓడితే శోకం అనే ఉద్వేగాలు కలుగుతాయి.

వికటుడు




పూర్వం కామాసురుడనే రాక్షసుడు ఉండేవాడట. ఆ కామాసురుడు శివుని గురించి ఘోర తపస్సు చేసి ముల్లోకాధిపత్యాన్ని సాధించాడు. అతని బారి నుంచి కాపాడే ఉపాయం సెలవిమ్మంటూ దేవతలంతా ముద్గల మహర్షిని వేడుకున్నారు. అంతట ఆ రుషి తదేక దీక్షతో ఓంకారాన్ని జపిస్తూ ఉంటే కనుక ఆ గణేశుడు ప్రత్యక్షమై వారి కష్టాన్ని తీరుస్తాడని సెలవిచ్చాడు. ముద్గలుని ఉపాయం పాటించిన దేవతలకు గణేశుడు వికటునిగా ప్రత్యక్షం అయ్యాడు. గణేశుని రూపు కాస్త విభిన్నంగా ఉంటుంది. అది ఒకోసారి ఓంకారాన్ని కూడా తలపిస్తుందని చెబుతారు. ఆ ఓంకార స్వరూపంతో కామాన్ని ఎదుర్కోవచ్చునని వికటుని వృత్తాంతం తెలియచేస్తోంది.

విఘ్నరాజు



కామ, క్రోధ, మోహ, లోభ, మద, మాత్సర్యాలనే అరిషడ్వర్గాలకు ప్రతీకగా ఇప్పటివరకూ రాక్షసులని చూశాము. ఇక మమతాసురుడు అనే రాక్షసుని కథ ఇది. శంబరుడు అనే రాక్షసుని ప్రలోభంతో మమతాసురుడు ముల్లోకాలనూ పీడించసాగాడు. దేవతల కోరిక మేరకు వినాయకుడు, విఘ్నరాజుగా అవతరించి మమతాసురుని సంహరించాడు. చిత్రంగా ఈ అవతారంలో వినాయకుడు నాగుపాముని వాహనంగా చేసుకున్నట్లు చెబుతారు. ఇక్కడ మమత అంటే దేహాభిమానానికి ప్రతీక. ఆ దేహంలోని కుండలిని జాగృతం చేసిన రోజున మోక్షానికి గల విఘ్నాలన్నీ తొలగిపోతాయి. దేహాభిమానానికి మమతాసురుడు, కుండలినికి సూచనగా నాగ వాహనం కనిపిస్తాయి.

ధూమ్రవర్ణుడు



అరిషడ్వార్గాలు అయిపోయాయి, దేహాభిమానమూ తీరిపోయింది. ఇక 'నేను' అనే అహంకారం ఒక్కటే మిగిలింది. దానికి సూచనే అహంకారాసురుడనే రాక్షసుడు. ధూమ్రము అంటే పొగ అన్న అర్థం కూడా వస్తుంది. ధూమ్రానికి ఒక ఆకారం అంటూ ఉండదు. ఒక పరిమితీ ఉండదు. సర్వవ్యాపి అయిన ఆ భగవంతుని ప్రతిరూపం ధూమ్రం. మనిషి 'తాను' అనే అహంకారాన్ని వీడి ఆ భగవంతునిలో ఐక్యం కావడానికి సూచనే ఈ అహంకారాసురుని వృత్తాంతం. 'నేను' అనే అహంకారాన్ని పక్కనపెట్టి తనను తాను తెలుసుకునే ప్రయత్నం చేస్తూ పరులకు ఉపకారం చేస్తూ దైవ చింతనతో దైవాన్ని వెతుకుతూ మోక్షంకోసం సాధన చేయడమే దీని సారాంశం.